# మృత్యుముఖంలో....

రచన :
"ముక్కామల"

నేను అపవిత్రవనీ, చెడిపోయిందానిననీ గుస గుసలుగా గాలికన్నా వేగంగా మీలో మీరే నన్ను గురించి విరగబడి చెప్పుకుంటారు గదూ! ఎందుకంత ఆతురతతో నాబోటి కులటనుగురించి గుంపులు గుంపులుగా కూడి దొంగ సానుభూతి చూపడం? బ్రతికుండగా మీ సానుభూతి లేకపోతే పోయింది. వున్న కాస్తంత చిల్లిని కంతగా చేయకుండా ఊరుకోరుగా! దానిలోనే యేదో మీకే తెలియని సౌఖ్యాన్ని అనుభవిస్తారుగదూ! మీలో కొందరు తెలివిగలాళ్ళు నన్ను "పిరికిపంద! బ్రతికుండి ఎదుర్కోవాలిగాని చచ్చి ప్రయోజనం?" అని తమ తెలివితనమంతా బయటపెట్టడం చాలుకొత్తారుగదూ! అవును! ఎందుకొట్టరూ? మీరే, మీతో గూడిన సమాజమే నన్నీవిధంగా ద్రోహం చేసింది. పిరికిపందను గా తయారు చేసి దిక్కు తెలియని చోటలో నడిసముద్రాన వదిలేసి ఈదుకురామంటే ఎలా? వేలాది సోదరీమణులు నాలాగే అయోమయంగా అనంతమైన యీ సమాజపు కోరల్లో పడి నలిగి జీవచ్ఛవాలుగా కాలాన్నీ తోసుకుపోవడం నే చూస్తున్నా. కాని నే నావిధంగా బ్రతకడం ఇష్టంలేదు. మృత్యు ముఖంలోనుంచి పల్కే ప్రతి పలుకు సత్యం అని చిన్నప్పుడు మీ అన్నయ్య ఇంగ్లీషు నవలలో కథానాయకుడు అన్నమాటలు చదవడం విన్నా. ఎందుకో "అన్నయ్య" అని తలచుకుంటే హృదయం నీరై ప్రవహిస్తోంది. నన్ను ఎంతో ఇదిగా ప్రేమిస్తాడు. చెల్లి! చెల్లి! అని కలవరిస్తాడు క్షణం కన్పడకపోతే. అయితే నేం! ఇక అందరితో పాటు తనుకూడ యీ సమాజపు గట్టుల్ని దాటలేక దానిలోనే ఒక అణువై దానినే గట్టిపరుస్తాడు. నేను తన చెల్లినై దాపరించినందుకు చిరాకుతో చిందులేస్తాడు. నిందిస్తాడు. సమాజం వినేందుకైనా ఆ కథానాయకుడు చెప్పినది ప్రబలసత్యమని ప్రత్యక్షంగా నాకిప్పుడు తోస్తోంది. ఇంతవరకు నాముందు మసక మసగ్గా అలుముకొన్న చీకటి తెరలు ఒకదానివెంట ఒకటి విచ్చుకుని నగ్నసత్యాన్ని వెన్నెలు వెలుగ్గా నాకు ప్రస్ఫుటంగా కన్పడేటట్లు చేస్తున్నాయి.

అది నాల్గేళ్ళనాటి సంగతి. మాది చాల బీద కుటుంబం. నాకే ఇతర విషయాలు ఆలోచించాల్సిన అవసరంలేని రోజులు. నా, నీ, అనే ఈర్ష్యా, జిగుప్సలు లేని దినాలు. మేకపిల్లలాగా గంతులు వేస్తూ అమాయకులైన మా బాలబృందంతో కేరింతలూ కొడుతూ, భావినిగురించి బుర్రలు చించుకుని ఆలోచించాల్సిన ఆవశ్యకతలేని సమయం. కాలం అనుకోకుండా వేసవిశలవు దినాల్లాగా సుఖవంతంగా గడిచిపోతోంది. అడుగులోనే హంసపాదు అన్నట్టు అప్పుడే బయలుదేరింది సమాజపు కుళ్ళుగాలి. నాకంటె పై మెట్టులో చదువుకున్న ఆకొద్దిమంది సోదరీమణుల్ని కొద్దోగొప్పో ఆసక్తితో చదువు చెప్పించుకునే తలిదండ్రులు సమాజానికి జడిసి వాటుగుగోడల్లో పోయేందుకు శాసించారు. పతివ్రతా ధర్మాన్ని కాపాడేందుకు గడప కదలనిచ్చేవారు కాదు. విజ్ఞానార్జనలో నవనవోన్మేషతమైన పూతీగల్లాగా పాకిపొయ్యే మనోభావాల మార్గాల్ని మరల్చారు. బాటతప్పిన నా సన్నిహితులే తమ శరీర సౌఖ్యంకోసరం నన్ను బాసటగా ఉపయోగించుకున్నారు. నాకప్పటికి పదేళ్లుకూడా ఉండయ్యో ఉండవో. దానితో నాజీవితనౌక చుక్కానికూడా నా చేతినుండి జారిపోయింది. ఏదో నాకే తెలియని పిచ్చి, పిచ్చి, ఆలోచనలు నా బుర్రలో చెలరేగినవి. ఏదో అందరాని సౌఖ్యాన్ననుభవించాలని ఆశ లుదయించినయి. అధోపాతానికి సోపానాలు కట్టేందుకు అక్కడే పునాది పడింది.

నేనేదో పెద్దచదువు ఉద్ధరిస్తానని నా తల్లి ఎంతో ఉబలాటపడేది. ఒక్క నిమిషంకూడ ఊరుకోనిచ్చేదికాదు తరగతులు, తరగతులు ఒక్కసారి గెంతేందుకు నాకుస్కూల్లో నేకాక ప్రయివేటు చదు

పుకూడా ప్రారంభం అయింది. ప్రయి వేటుమీద తలిస్తే నాగుండె తునతునాలెందుకు కాలేదా అని అనిపిస్తుంది. వెన్నులో కత్తితో గుచ్చి లాగినట్టుగా బాధపడతా.

రాత్రిపూట నాతోటి పిల్లలందరు వెళ్ళిపోయినా నాకు క్రొత్తపాఠం చెప్తానుండమనేవాడు. పంతులు అందులో గురువుగారయ్యే! కాదనేదెలా? ఆ మొదటిరోజు తలుచుకుంటే హృదయం ఒణికిపోతోంది. కాని తర్వాత నేనే ఉండడం ప్రారంభించా. ఆనాటినుంచే సమాజపుకోరలు నావైపుకి చాచి లాకులెత్తిన నీరులాగా ఉద్వృత్తుగా నాపైకి పెరిగి వస్తున్నాయి గాంవాల్లూ! లేకపోతే అంత ఘోరంగా, హడలెత్తించేట్టుగా వర్ణించే మృత్యుగహ్వరంలోకి తెగించి సునాయాసంగా ఉరక కల్గుతానా?

వాడికిదివరకే పెళ్ళయిందట, ఇద్దరో ముగ్గురో పిల్లలుకూడానట. వాళ్ళనంతా ఎక్కడో దిగబెట్టి వచ్చాట్ట. "ఇంకా పైన నిన్నుకూడా యేం చేసుకునేది" అంటాడు సిగ్గన్నా లేకుండా! అయితే ఎందుకు చేశాడా ఘోరం? అవును! ఉందిగా సమాజం వెనువేసుకురావడానికి? పురుషుడెంతకైనా తగునట. అమాయకులైన నాబోటి వాళ్ళేగా వీళ్ళకు కనపడేది దుమ్మెత్తి పోయడానికి! నా కడుపే గా ఎత్తుగా కనపడేది వాళ్ళ చర్మ చక్షువులకి తూలనాడేందుకు! మళ్ళీ, ఆపెద్దే రేపు బయటకొచ్చి ధర్మపన్నాలు వర్ణిస్తాడు. నీతిని గురించి పెద్దగా గంభీరంగా మాట్లాడతాడు. పాతివ్రత్య ధర్మాన్ని ప్రబోధిస్తాడు. ఉందిగా గుడ్డి సమాజం శభాష్! అని తలలూపడానికి!

విచిత్రం యేమంటే చివరికి నా సోదరే నన్ను తంతాను, పీకతాను, చీల్చేస్తానంది, తను వంగనాచైనట్టు! తను ఈ కాకిలోకాన్నుంచి తెలివిగా తప్పించుకుని బైటపడ్డానని గర్వం గాంవాల్లూ! తనూ సమాజపు విషకాటుకు గురై గడ్డికరుస్తున్నది తెలియదు!

ఒక్కసారైనా దాన్నిగురించి ఆలోచించినట్లన్నా కనపడదు.

కర్మ! ఈ రోజుతో తీరిపోయింది. దానిగడువనంటారు గాంవాల్లూ వేదాంతులు తమ మెట్ట వేదాంతానికి మురిసిపోతూ! భూమికి భారం వదిలిందని విస్తుపోతారు గాంవాల్లూ నీతిపరులు పతివ్రతలుకూ!

ఎవరేమన్నా అననీ! నాయీ చివరి ఆవేదనతో నాయీ రెండుమాటల్తో కథల్లో చెప్పే "మంత్రకోల"గా సమాజాన్నొక్కసారికి గాఢ నిద్రనుండి మేల్కొలుపుతుందనే భ్రమ నాకులేదు. ఏవొక్కడి బుర్రలోనైనా నాబోటి అనాథలను గురించి ఆలోచనలు రేపుతుందేమోనని ఆశ. ఒకసారి తమ దృష్టిని నాబోటి దీనులమీదికి పంపుతారనే కుతూహలం. ఈనాదెవరికి బలిదానంకూడ అందుకే. ఏమో!


ఆయుర్వేద వైద్యనిలయం - వారి

"లుకోరియా క్యూర్"

అద్భుత కుసుమరోగ నివారిణి.

స్త్రీలకు తరుచు సంభవించు శ్వేతరక్త ప్రదరరోగములకు, బహిష్టు నొప్పులకు దివ్యౌషధమని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. ఇంకను దీనిని సేవించుటవలన ఇతర గర్భాశయ వ్యాధులను కూడ నిర్మూలించి వంధ్యత్వమును తొలగించును. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము కనుగొనబడిన ఆయుర్వేద ఔషధము.

90 మాత్రల ప్యాకెట్లు—వెల రు. 2-8-0.

ప్యాకింగు పోస్టేజి అదనము.

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట, మచిలీపట్నం.

అన్ని మందుల షాపులలోనూ దొరకును.